క్లుప్తంగా

శిలాఫలకం ధ్వంసం


ధ్వంసమైన శిలాఫలకం

ఐనవోలు: మండలంలోని నర్సింహులగూడెం గ్రామంలో ఇటీవల పంచాయతీరాజ్ నిధులు రూ. 2.39 కోట్లతో బీటీ రోడ్డు వేశారు. ఈ నెల 5వ తేదీన ఎమ్మెల్యే అరూరి రమేష్ శిలాఫలకం ఆవిష్కరించారు. కాగా గుర్తు తెలియని వ్యక్తులు శిలాఫలకాన్ని శనివారం రాత్రి ధ్వంసం చేశారు. ఈ మేరకు నర్సింహులగూడెం కారోబార్ కుంటాల బాబు ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వంగాల నవీన్‌కుమార్ తెలిపారు.

వడ్డెర సంఘం కమిటీ ఎన్నిక


పూజారి సదానందం

కమలాపూర్ : వడ్డెర సంఘం మండల అధ్యక్షుడిగా మండలంలోని శ్రీరాములపల్లి గ్రామానికి చెందిన పూజారి సదానందంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కేంద్రంలో ఆదివారం జరిగిన వడ్డెర కులస్తుల సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా శివరాత్రి విజేందర్, ఉపాధ్యక్షులుగా బొంత శ్రీనివాస్, శివరాత్రి లింగయ్య, కార్యదర్శులుగా పల్లపు కుమారస్వామి, పల్లపు శ్రీను, సంపంగి యాకస్వామి, ఓర్సు తిరుపతి, శివరాత్రి రాకేష్, గౌరవ సలహాదారులుగా ఆలకుంట నర్సింహులు, కస్తూరి ముత్యాలు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో వడ్డెర కుల పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

నేడు 'సమర శంఖారావం'

కమలాపూర్ : మండలం కేంద్రంలోని ఉమామహేశ్వర గార్డెన్స్‌లో సోమవారం 'హుజూరాబాద్ సమర శంఖారావం' నిర్వహించనున్నట్లు బీజేపీ మండల అధ్యక్షుడు కట్కూరి అశోక్‌రెడ్డి తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హుజూరాబాద్ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి, రాష్ట్ర ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ హాజరుకానున్నట్లు తెలిపారు. ఉదయం 9.30 గంటలకు మండలంలోని బత్తివస్‌పల్లి హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. బత్తివస్‌పల్లి నుంచి కమలాపూర్ వరకు ర్యాలీ నిర్వహించి సమావేశంలో పాల్గొనున్నట్లు పేర్కొన్నారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు సమావేశానికి భారీగా హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

మృతదేహానికి నివాళి



శాయంపేట : మండలంలోని సూరంపేట, ప్రగతిసింగారం గ్రామాలకు చెందిన బత్తుల సమ్మయ్య, బోయిని సొదలయ్య అనారోగ్యంతో బాధపడుతూ మృతిచెందగా ఆదివారం ఎంపీపీ తిరుపతిరెడ్డి పరామర్శించారు. మృతుల భౌతిక కాయంపై పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట సర్పంచ్‌లు రజితరఘుపతిరెడ్డి, సుమలత రమణారెడ్డి, సాంబయ్య, ఎంపీటీసీ రజిని, ఏఎంసీ వైస్ చైర్మన్ నందం, పీఏసీఎస్ డైరెక్టర్ జయపాల్‌రెడ్డి, ఉపసర్పంచ్ సుమన్, నాయకులు నాగరాజు, వేణు, ఇంద్రయ్య, సురేంద్రచారి, రాజయ్య, మాదవరెడ్డి, వెంకటేష్, సురేందర్, ఆనందం, సంపత్, పోషాలు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు యువత మద్దతు



శాయంపేట : ముఖ్యమంత్రి కేసీఆర్ అందజేస్తున్న సంక్షేమ పథకాలతో యువత బీఆర్‌ఎస్ వైపే ఉన్నారని సర్పంచ్ చిట్టిరెడ్డి రాజిరెడ్డి అన్నారు. మండలంలోని పత్తిపాకలో యూత్ అధ్యక్షుడు పెండెల కిరణ్ అధ్యక్షతన ఆదివారం యువకులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన హాజరై ప్రసంగించారు. ఎమ్మెల్యే గండ్ర గెలుపు కోసం యువకులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. గ్రామ అధ్యక్షుడు పసుల ప్రవీణ్, నాయకులు ఘంట శ్యాంసుందర్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, ఐల్లయ్య, శ్రీను పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ సేవలు ఆదర్శం

ఖిలా వరంగల్: రోటరీ క్లబ్ సామాజిక సేవలు ఆదర్శనీయమని రోటరీ క్లబ్ ఆఫ్ వరంగల్ అధ్యక్షుడు మామిడాల రమేష్ బాబు, తోట వైద్యనాథ్ అన్నారు. ఉచిత వైద్య శిబిరాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వరంగల్ ఫోర్టురోడ్డులోని రోటరీ క్లబ్ భవనంలో తోట వైద్యనాథ్ ఆధ్వర్యంలో ఆరుషి హాస్పటల్ నేతృత్వంలో గుండెకు సంబంధించిన ఈసీజీ, మధుమేహ పరీక్షలను ఆదివారం నిర్వహించారు. జనరల్ మెడిసిన్ డాక్టర్ హరిరమాదేవి, డాక్టర్ శివాని, డాక్టర్ కంది సాయి, తోట మహేష్, మామిడాల సుధాకర్, ఆనంద్‌రావు, రామగిరి రవీందర్, శివ, వెంకటేశ్వర్లు, తోట మధుమతి, దేవ, సాంబమూర్తి, రామగిరి రవీందర్ పాల్గొన్నారు.

అటు నుంచి ఇటు.. ఇటు నుంచి అటు !

- ఎన్నికలు సమీపిస్తుండడంతో జోరుగా జంపింగ్‌లు


ఆత్మకూరు : రేవంత్‌రెడ్డితో బీఆర్‌ఎస్ నాయకులు


శాయంపేట : పార్టీలోకి ఆహ్వానిస్తున్న సారయ్య


ఆత్మకూరు : ఎమ్మెల్యే ధర్మారెడ్డితో విక్రమ్


శాయంపేట : కండువా కప్పుతున్న సత్యనారాయణరావు


వేలేరు : బీజేపీలో చేరుతున్న యువకులు

ఆత్మకూరు: ఎన్నికలు సమీపిస్తుండడంతో రాజకీయ పార్టీల్లో వలసలు షురూ అయ్యాయి. మండలంలోని బీఆర్‌ఎస్ నాయకులు ఎంపీపీ మార్క సుమలత భర్త రజనీకర్, జెడ్పీటీసీ కక్కెర్ల రాధిక భర్త రాజు, నీరుకుళ్ల ఎంపీటీసీ అర్షం వరుణ్‌గాంధీ శనివారం రాత్రి హైదరాబాద్‌లో పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌కు గుడ్‌బై చెప్పి కాంగ్రెస్ అభ్యర్థి రేవూరి ప్రకాశ్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన విషయం తెలిసిందే. కాగా ఆదివారం యూత్ కాంగ్రెస్ నాయకుడు అర్షం విక్రమ్ కాంగ్రెస్‌ను వీడి బీఆర్‌ఎస్‌లో చేరారు. అతనికి ఎమ్మెల్యే ధర్మారెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎన్నికలు దగ్గరపడుతున్న కొద్దీ ఇంకా వలసలు పెరిగే అవకాశాలు ఉన్నాయని స్థానికులు చర్చించుకుంటున్నారు.

బీజేపీలో చేరిక..

వేలేరు : నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేందుకు ఒక్క అవకాశం ఇచ్చి ఎమ్మెల్యేగా గెలిపించాలని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుండె విజయరామారావు అన్నారు. మండలంలోని గుండ్లసాగర్ గ్రామానికి చెందిన పలువురు యువకులు ఆదివారం పార్టీలో చేరగా ఆయన కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమకారుడినని తనకు ఒక్క అవకాశం ఇవ్వాలని కోరారు. తెలంగాణ ఉద్యమ ద్రోహి కడియం శ్రీహరి అని విమర్శించారు. కడియం శ్రీహరి ఆనాడు తెలంగాణ ఉద్యమకారులపై అక్రమ కేసులు పెట్టించాడని ఆరోపించారు. అనంతరం మండల కేంద్రంలో స్థానికులతో కలిసి ఛాయ్ పే చర్చ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రాజు, బీసీ మోర్చా అధ్యక్షుడు సురేష్, బీజేవైఎం మండల అధ్యక్షుడు రాజు, నాయకులు సీత సంపత్, శ్రీనివాస్, శివరాత్రి మహేష్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక..

శాయంపేట : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని చూసి బీఆర్‌ఎస్ పార్టీలో చేరికలు జోరందుకుంటున్నాయని ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం శాయంపేట గ్రామానికి చెందిన యువకులు చెల్పూరి బంటి, కందికొండ వికాస్, సమీర్, సాయి, మనికేష్, అరుణ్, శివ, విఘ్నేష్, శేఖర్, విరాట్‌తో పాటు 30మంది యువకులు బీఆర్‌ఎస్‌లో చేరగా ఆయన కండువా కప్పి ఆహ్వానించారు. నవంబర్ 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డిని అధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ వంగాల నారాయణరెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ మారంపల్లి నందం, పీఏసీఎస్ చైర్మన్ కుసుమ శరత్, మాజీ సర్పంచ్ చంద్రమౌళి, ఉపసర్పంచ్ సుమన్, నాయకులు రాజేందర్, శంకరాచారి, ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక..

ఎన్నికల సమయం సమీపిస్తున్న తరుణంలో ఓట్ల మాయమాటలు చెప్పడం బీఆర్‌ఎస్‌కు అలవాటేనని టీపీసీసీ సభ్యుడు, కాంగ్రెస్ పార్టీ భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని అన్నారు. మండల కేంద్రానికి చెందిన బుడగ జంగాల సంఘం అధ్యక్షుడు తూర్పాటి రాజయ్య, ఎమ్మార్పీఎస్ మండల కార్యదర్శి మారపల్లి ప్రకాశ్, మైలారం మాజీ ఉపసర్పంచ్ ఏనుగుల అశోక్, వార్డు సభ్యులు నూనె ప్రకాశ్‌తో పాటు 150మంది ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరగా ఆయన కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తొమ్మిదేళ్ల పాలనలో చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. కాంగ్రెస్ హయాంలోనే నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు, రైతులకు ఏకకాలంలో లక్ష రూపాయలు రుణమాఫీ, ఆరోగ్య సేవలు, విద్యార్థులకు ఫీజు రియాంబర్స్‌మెంట్ అందించినట్లు పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి, నాయకులు పోలేపల్లి శ్రీనివాస్‌రెడ్డి, చల్లా చక్రపాణి, దుబాసి కృష్ణమూర్తి, మారపల్లి రవీందర్, చింతల రవిపాల్ పాల్గొన్నారు.

చలివాగు ప్రాజెక్టు ప్రధాన కాల్వకు గండి


ప్రధాన కాల్వకు గండి పడి ప్రవహిస్తున్న నీరు

శాయంపేట : మండలంలోని జోగంపల్లి శివారు మధ్యతరహా చలివాగు ప్రాజెక్టు ప్రధాన కాల్వకు శనివారం రాత్రి గండి పడింది. గండి ద్వారా నీరు చలివాగులోకి ప్రవహించాయి. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులకు సమాచారం ఇవ్వగా, చలివాగు తూము షట్టర్ మూసి వేయించి నీటిని నిలుపుదల చేయించారు. ప్రాజెక్టు ద్వారా అధికారికంగా 3067 ఎకరాలకు సాగునీరు అందుతుండగా, మరో రెండు వేల ఎకరాలకు అనధికారికంగా సాగు నీరు అందుతోంది. ప్రధాన కాల్వ ద్వారా శాయంపేట, పరకాల, రేగొండ, మండలాలకు సాగునీరు అందుతుంది. కొత్తగా నిర్మించిన బ్రిడ్జి పక్కనే ప్రధాన కాల్వకు గత ఏడాది గండిపడగా, అధికారులు తాత్కలిక మరమ్మతు పనులు చేపట్టారు. కాల్వ కుంగిపోవడంతో నీటిని తక్కువగా సరఫరా చేస్తున్నారు. దీంతో చివరి ఆయకట్టుకు సాగునీరు అందకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అయితే పంటలు ఎండిపోకుండా సాగునీరు అందించాలని రైతుల కోరారు. దీంతో కాల్వకు సంవృద్ధిగా నీరు విడుదల చేయడంతో గత నెల నుంచి నీరు పారుతోంది. శనివారం రాత్రి ప్రధాన కాల్వకు గండి పడడంతో నీరంతా చలివాగులోకి మళ్లాయి. దీంతో స్థానిక సర్పంచ్, అధికారులు చలివాగు తూము షట్టర్ మూసి నీటి సరఫరాను నిలిపివేశారు.

కౌశిక్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలి


మాట్లాడుతున్న తిరుపతిరావు

కమలాపూర్ : ఎమ్మెల్సీ, హుజూరాబాద్ బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు నాయినేని తిరుపతిరావు కోరారు. మండలంలోని ఉప్పల్‌లో పోతిరెడ్డి రఘు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ముదిరాజ్ కులస్తుల సమావేశానికి అయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ముదిరాజ్ కులస్తుల కులదైవమైన పెద్దమ్మ తల్లి దేవాలయ అభివృద్ధికి రూ.10 లక్షలు కేటాయించినట్లు తెలిపారు. ఎమ్మెల్యేగా కౌశిక్‌రెడ్డిని గెలిపిస్తే మిని ఫంక్షన్ హాల్ నిర్మాణంతో పాటు ఉప్పల్ మండలం ఏర్పాటుకు కృషి చేస్తారన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ ప్రకటించిన మేనిఫెస్టో ద్వారా అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేకూరుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎర్రబెల్లి దేవేందర్‌రావు, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షులు ఎర్రబెల్లి సంపత్‌రావు, బీఆర్‌ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు జక్కుల రాజు, మొండిద్దుల రాజమౌళి, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, మాజీ జెడ్పీటీసీ మారపల్లి నవీన్ కుమార్, ముజీబ్ హుస్సేన్, వార్డు సభ్యులు శ్రీధర్‌రావు, పద్మ సంపత్, పోతిరెడ్డి సంపత్, శ్రీను, యూత్ నాయకులు, ముదిరాజ్ యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అండర్ రైల్వే జోన్‌లో 2రోజులు నీటి సరఫరా బంద్

వరంగల్ అర్బన్: మిషన్ భగీరథ ఆధ్వర్యంలో ధర్మసాగర్ 60 ఎంఎల్‌డీ ఫిల్టర్ల వద్ద నిర్వహణ పనులు కొనసాగుతున్నందున సోమ, మంగళవారాల్లో అండర్ రైల్వే జోన్ పరిధిలో నీటి సరఫరా ఉండదని బల్దియా ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. బల్దియా అండర్ రైల్వే జోన్ పరిధిలోని కరీమాబాద్, పెరుకవాడ, శివనగర్, రంగశాయిపేట, శంభునిపేట, తిమ్మాపూర్, సింగారం, మామునూరు, బొల్లికుంట, శాకరాశికుంట, ఎస్ఆర్ఆర్ తోట, ఏకశిలనగర్, కాశికుంట, ఖిలా వరంగల్, ధూపకుంట, వసంతపురం, స్తంభంపల్లి, నక్కలపెల్లి, లక్ష్మీపురం, భట్టుపల్లి, కడిపికొండ, రాంపూర్, మడికొండ, దేవన్నపేట ప్రాంతాల్లో రెండు రోజులు నీటి సరఫరా ఉండదని పేర్కొన్నారు.

కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటా

- కాంగ్రెస్ అభ్యర్థి పొన్నం ప్రభాకర్


మాట్లాడుతున్న పొన్నం ప్రభాకర్‌గౌడ్

ఎల్కతుర్తి: పార్టీ కోసం పనిచేసే ప్రతీ కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటానని హుస్నాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పొన్నం ప్రభాకర్ అన్నారు. కార్యకర్తలే పార్టీకి పట్టుకొమ్మలని, కాంగ్రెస్ ప్రకటించిన మేనిఫెస్టోను గడప గడపకు వెళ్లి ప్రచారం చేయాలని కోరారు. ఆదివారం భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండల కేంద్రాల్లో ఏర్పాటు చేసిన బూత్‌లెవల్ సమావేశంలో ఆయన ముఖ్యతిథిగా హాజరై మాట్లాడారు. 'ఇవ్వాటి నుంచి 33రోజుల పాటు పార్టీ కోసం, నా కోసం కష్టపడడండి. తరువాత మీమ్మల్ని గుండెలోపెట్టి చూసుకుంటా, ఎన్నికల ప్రచారంలో నిర్లక్ష్యం చేయొద్దు' అని కోరారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు. గత ఎన్నికల్లో కేసీఆర్ చేసిన వాగ్దానాల్లో ఏఒక్కటి నెరవేర్చలేదని విమర్శించారు. కరీంనగర్ ఎంపీగా ఉన్నప్పుడు ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు కోసం తాను ఉద్యమం చేశానని గుర్తు చేశారు. కేసీఆర్‌కు సెంటిమెంట్ హుస్నాబాద్ అయితే డెవలప్‌మెంట్ మాత్రం సిద్దిపేట, గజ్వేల్ అన్నారు. ప్రభుత్వం నిధులు, బిల్లులు ఇవ్వకపోవడంతో సర్పంచ్‌లు దీన స్థితిలోకి వెళ్లారని అన్నారు. కేసీఆర్‌కు చిత్తశుద్ధి ఉంటే ధర్మసాగర్ రిజర్వాయర్ ఎత్తుపెంచి మెట్టప్రాంతాలకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. పార్టీలో వ్యక్తిగత, అంతర్గత సమస్యలకు తావివ్వకుండా సమన్వంగా ముందుకెళ్లాలని అన్నారు. గడిచిన తొమ్మిదేళ్లలో స్థానిక ఎమ్మెల్యే సతీష్‌బాబు హుస్నాబాద్‌లో ఒక్క డబుల్ బెడ్రూం ఇళ్లు కట్టించలేదని, దళితబంధు ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. ఏఐసీసీ కార్యదర్శి కిష్టపర్ తిలక్, ఏఐసీసీ సభ్యుడు గోపినాథ్ పలానీ అప్పన్, సీపీసీ సభ్యుడు అశోక్‌రెడ్డి, మండల అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి, సంతాజీ, అక్తర్ అలీ, చల్లా రవీందర్‌రెడ్డి, రాముడు, సురేందర్ పాల్గొన్నారు.

కేయూలో ఇద్దరికి డాక్టరేట్


జ్యోత్స్నాదేవి


హారికాదేవి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో ఇద్దరు పరిశోధకులకు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. ఇంగ్లిష్ విభాగం పరిశోధకురాలు వడ్నాల జ్యోత్స్నదేవికి డాక్టరేట్ ప్రకటించారు. ది స్టడీ ఆఫ్ గీతహరిహరన్స్ సెలక్ట్ నావెల్స్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి జ్యోత్స్నదేవికి డాక్టరేట్ ప్రదానం చేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ మల్లారెడ్డి తెలిపారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మేఘనరావు పర్యవేక్షణలో జ్యోత్స్న తన పీహెచ్‌డీ పూర్తిచేశారు. అలాగే, మైక్రో బయాలజీ విభాగం పరిశోధకురాలు మనుబోలు హారికాదేవికి డాక్టరేట్ ప్రకటించారు. బయో ఇథనాల్ ప్రొడక్షన్ ఫ్రమ్ అగ్రికల్చరల్ వేస్ట్ యూజింగ్ ఐసోలేటెడ్ ఫంగల్ స్పిసియస్ అనే అంశంపై ఆ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ముంజం శ్రీనివాస్ పర్యవేక్షణలో సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి హారికాదేవికి డాక్టరేట్‌ను ప్రదానం చేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ మల్లారెడ్డి తెలిపారు.

ఎంజీఎం ఆస్పత్రికి అంబులెన్స్ బహూకరణ

మర్కజీ పాఠశాలకు కంప్యూటర్ల అందజేత


అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న రాజేశ్‌కుమార్

ఎంజీఎం / కాశిబుగ్గ: వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి ఎస్‌బీఐ చీఫ్ జనరల్ మేనేజర్ రాజేశ్‌కుమార్ ఆదివారం అంబులెన్స్‌ను బహూకరించారు. ఈమేరకు అంబులెన్స్‌కు సంబంధించిన పత్రాలను ఎంజీఎం ఆర్ఎంఓలు మురళి, ప్రసాద్‌కు అందించారు. అలాగే, ప్రభుత్వ మర్కజీ పాఠశాలకు రూ.5 లక్ష విలువగల కంప్యూటర్లను సైతం అందించినట్లు రాజేశ్‌కుమార్ పాటు తెలిపారు. కాజీపేటలోని సహృదయ వృద్ధాశ్రమానికి రూ.2లక్షల విరాళం అందించనున్నట్లు తెలిపారు. ఎస్‌బీఐ బ్యాంకు ద్వారా సమాజ సేవ చేయాలనే ఉద్దేశంలో విద్య, వైద్య రంగాలతో పాటు సామాజిక సేవ దృక్పథంలో వృద్ధాశ్రమాలకు విరాళాలు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ జనరల్ మేనేజర్ వివేక్‌చంద్ర, బ్యాంక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి


కార్యకర్తలతో మాట్లాడుతున్న గండు రాము

దామెర: బీఆర్‌ఎస్ అభ్యర్థి చల్లా ధర్మారెడ్డి గెలుపు కోసం ప్రతి కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు గండు రాము కోరారు. మండల కేంద్రంలో ఆదివారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి చేసిన అభివృద్ధి పనులను గడపగడపకు వివరిస్తూ, లక్ష ఓట్ల మెజారిటీ వచ్చే విధంగా కృషి చేయాలని కోరారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని వెల్లడించారు. సమావేశంలో గ్రామ అధ్యక్షుడు బత్తిని చిన్నరాజు, మండల రైతుబంధు కోఆర్డినేటర్ బిల్లా రమణారెడ్డి, గ్రామ ప్రధాన కార్యదర్శి వేల్పుల ప్రసాద్, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు పోలం కృపాకర్‌రెడ్డి, ఎంపీపీ శంకర్, వైస్ ఎంపీపీ జాకిర్‌అలీ, దళిత బంధు మండల చైర్మన్ గరిగె కృష్ణమూర్తి, మండల సమన్వ కమిటీ సభ్యులు శంకర్, మల్లయ్య, కమలాకర్, కృష్ణమూర్తి, మల్లయ్య, రాజు, సయ్యద్ అక్తర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

'విశ్వబ్రాహ్మణ' సభ కరపత్రాల ఆవిష్కరణ


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు

హన్మకొండ: నవంబర్ 5వ తేదీన హైదరాబాద్ ఉప్పల్‌లోని బగాయిత్‌లో జరగనున్న విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ మహాజన సభకు పెద్దసంఖ్యలో తరలివచ్చి విశ్వబ్రాహ్మణుల ఐక్యతను చాటాలని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చొల్లేటి కృష్ణమాచార్యులు పిలుపునిచ్చారు. ఈమేరకు హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో మహాజన సభ కరపత్రాలను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కృష్ణమాచార్యులు మాట్లాడుతూ మహాజన సభ ద్వారా పాలక, ప్రతిపక్ష పార్టీల దృష్టికి సమస్యలు తీసుకెళ్లడమే లక్ష్యమన్నారు. కార్యక్రమంలో సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు అలుగోజు కృష్ణమూర్తి, వోపా జిల్లా అధ్యక్షుడు రామోజు నాగరాజు, నాయకులు పెండోట చక్రపాణి, వీణవంక సదానందం, గజ్జెల వీరన్న, రాళ్లబండి వీరాచారి, జయసేన, నాగసోమేశ్వరాచారి, విష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

దారితప్పిన బాలుడి అప్పగింత

ఖిలా వరంగల్: వరంగల్ పడమరకోటలో దారితప్పిన ఓ బాలుడిని ఆదివారం సాయంత్రం మిల్స్ కాలనీ పోలీసులు అతని తండ్రి చెంతకు చేర్చారు. ఆడుకుంటూ వెళ్లి ఇంటి దారి తెలియక ఏడుస్తుండగా స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు బాలుడి సమాచారాన్ని తెలుసుకుని అప్పగించారు.

బెల్ట్ షాపులపై ఎన్నికల అధికారుల దాడులు


గ్రామాల్లోని బెల్ట్‌షాపులపై దాడులు చేస్తున్న అధికారులు

నడికూడ: మండలంలోని రామకృష్ణపూర్, కంఠాత్మకూర్, ధర్మారం గ్రామాల్లో గల బెల్ట్ షాపులపై ఎన్నికల అధికారి (ఎంసీసీటీం) శేషాద్రిస్వామి, పరకాల ఎస్సై సత్యనారాయణ ఆదివారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో అక్రమ మద్యం విక్రయించొద్దని సూచించారు. ఎన్నికల నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని వారు కోరారు. బెల్ట్‌షాపులపై ప్రత్యేక నిఘా ఉంచుతున్నట్లు తెలిపారు. మద్యం విక్రయించి కేసుల పాలవ్వద్దని వారు సూచించారు.

దైవభక్తి కంటే దేశభక్తి గొప్పది


ఆటోడ్రైవర్లకు డ్రెస్‌లు అందజేస్తున్న ట్రస్టీలు

వరంగల్: దైవభక్తి కంటే దేశభక్తి గొప్పదని శివానంద గురు కల్చరల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్ట్ త్రిపురనేని గోపీచంద్ అన్నారు. పైడిపల్లి ఆరెపల్లి ములుగు రోడ్డు ప్రాంతంలో ఆటో డ్రైవర్లకు ఆదివారం డ్రెస్‌లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధర్మ మార్గంలో ఉంటే భగవంతుడు అండగా ఉంటాడని చెప్పారు. భోజన విరామం అనంతరం జరిగిన లాయక్ అహ్మద్ సంగీత కచేరీ అలరించింది. కార్యక్రమంలో ట్రస్టీలు బండారు సాయి నారాయణ, గందె ఉమాశంకర్, రాంరెడ్డి, చక్రపాణి, వెంకటరమణ, కిశోర్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

హసన్‌పర్తి: నగరంలోని 56వ డివిజన్ గోపాలపురంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సీనియర్స్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ సహకారంతో ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సిరంగి సునీల్‌కుమార్ మాట్లాడుతూ వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్స్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు నర్సయ్య, దామోదర్, తేరాల యుగంధర్, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు మణీందర్‌నాథ్, మాజీ ఉప సర్పంచ్ రమేష్ పాల్గొన్నారు.

రోహిణిలో పక్షవాతానికి అధునాతన చికిత్స


మాట్లాడుతున్న బుచ్చిరెడ్డి

హన్మకొండ: పక్షవాతానికి గురైన రోగులకు ప్రత్యేక చికిత్స అందిస్తున్నట్లు రోహిణి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ బుచ్చిరెడ్డి అన్నారు. ప్రపంచ పక్షవాత దినోత్సవం సందర్భంగా హనుమకొండ సుబేదారిలోని రోహిణి ఆస్పత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన బ్రెయిన్ స్ట్రోక్ యూనిట్ న్యూరో ఐసీయూను ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ బుచ్చిరెడ్డి ఆదివారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పక్షవాతానికి అధునాతన పద్ధతుల ద్వారా చికిత్స అందిస్తున్నట్లు వివరించారు. ఆరోగ్యశ్రీ ద్వారా చేరిన రోగులకు ఇతర రోగులతో సమానంగా ప్రాధాన్యం ఇస్తూ వైద్య సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. పక్షవాతానికి గురై ఆస్పత్రికి వస్తున్న రోగుల సంఖ్య పెరగడంతో ఆ మేరకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ప్రత్యేకంగా న్యూరో ఐసీయూను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

నీరా.. తనివితీరా..!



కాజీపేట: ఈత చెట్ల నుంచి ఉదయం పూట తీసే నీరాకు ప్రజల నుంచి విశేష ఆదరణ ఉంది. ఈ నీరాలో అనేక ఔషధ గుణాలున్నాయని, అది తాగితే రోగ నిరోధక శక్తి పెరుగుతుందనే భావన ఉంది. షుగర్ పేషంట్లకు దివ్య ఔషధంగా పని చేస్తుందనే నమ్మకంతో చాలా మంది నీరా తాగేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. కాజీపేట మండల కేంద్రం శివారులో ఉన్న అనేక గ్రామాల్లో ఈత చెట్ల నుంచి గీత కార్మికులు ఉదయం, సాయంత్రం నీరా సేకరించి విక్రయిస్తున్నారు. ఉదయం పూట తీస్తున్న నీరా కొనుగోలుకు అనేక మంది ముందుకు వస్తుండడంతో నీరాకు మార్కెట్‌లో బాగా డిమాండ్ పెరిగింది. ముందస్తుగా ఫోన్లలో నీరాను ఆర్డర్ చేసి మరీ కొనుగోలు చేస్తున్నారు.